


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

మంగళవారం 26 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 358 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## కనీస వేతనాల పెంపుపై సీఎం రేవంత్ రెడ్డికి సీపీఐ, సీపీఎం నేతల ధన్యవాదాలు



### రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది : సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 26, ప్రతినిధి: తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను సీపీఐ, సీపీఎం ప్రతినిధి బృందాలు విడివిడిగా కలిసి కనీస వేతనాల సవరణ చట్టం తీసుకురావడంపై ధన్యవాదాలు తెలియజేశాయి. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని బృందంలో సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, పశ్య పద్మ, ఈ.నరసింహ, చాడ వెంకట్ రెడ్డి, బాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని, మొక్కజొన్న దిగుబడి అధికంగా వచ్చినప్పటికీ కేంద్రం కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వానికి నష్టం వచ్చినా రైతుల ప్రయోజనాల కోసం కొనుగోలు కొనసాగిస్తున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని సీపీఎం బృందం ముఖ్యమంత్రిని కలిసి కనీస వేతనాల సవరణ చట్టంపై అభినందనలు తెలిపింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పి.సుదర్శన్, జ్యోతి, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి, సామినేని స్వరాజ్యం, ఎం.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం మద్దతు ధర ప్రకటించినప్పటికీ పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తోందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత ఏర్పడిందని, ఎండల తీవ్రత వల్ల మధ్యాహ్న సమయంలో పనులు మందగిస్తున్నాయని పేర్కొన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. మూసీ నిర్వాసితులకు స్థానికంగానే ఇళ్లు మంజూరు చేస్తామని, మూసీపై బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మూసీ కాలుష్యం కారణంగా నల్గొండ జిల్లా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, నగర ప్రజలకు నాణ్యమైన జీవన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, భోజనం అందిస్తున్నామని, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆరుట్ల స్కూల్‌ను సీపీఎం నాయకులు సందర్శించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## కృష్ణా జలాల వినియోగంపై తెలంగాణ కర్ణాటక కీలక భేటీ





సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 26, ప్రతినిధి: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కర్ణాటక చిన్న నీటిపారుదల, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి బోసు రాజులు కీలక సమావేశం నిర్వహించారు. తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వినియోగం, త్రాగునీటి అవసరాలు, సాగునీటి ప్రాజెక్టులపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ. చిన్నారెడ్డి, రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్, నాగర్ కర్నూల్ లోకసభ సభ్యుడు మల్లు రవి, రాయచూరు రూరల్ ఎమ్మెల్యే బసవన్న గౌడ, ఉమ్మడి పాలమూరు ప్రాంత ప్రజాప్రతినిధులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, రాజేష్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, వంశీకృష్ణ, రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్, ఈఎన్సీ రమేశ్ బాబు, కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ కార్యదర్శి బి.కే. పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలగకుండా ప్రాజెక్టుల రూపకల్పన ఉండాలని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాలకు ఉపయోగపడే విధంగా సాగునీటి, త్రాగునీటి ప్రాజెక్టులపై కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. కృష్ణానదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణ అంశాలతో పాటు సాంకేతిక విషయాలపై విస్తృతంగా చర్చించామని పేర్కొన్నారు. తెలంగాణ సాగునీటి హక్కులు, భవిష్యత్ అవసరాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, కృష్ణా జలాల సమన్యాయ వినియోగంలో రాష్ట్ర హక్కులను కాపాడుకునేలా చర్చలు జరిగాయని తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడుతున్నామని, తెలంగాణ రైతాంగ సాగునీటి అవసరాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.



## వివిధ కార్పొరేషన్ల నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లు సీఎం రేవంత్ రెడ్డిని కలిసినరు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 26, ప్రతినిధి: తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను ఇటీవల వివిధ కార్పొరేషన్లకు ఎంపికైన నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని వారు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధిలో కార్పొరేషన్లు కీలక పాత్ర పోషించాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.




## హైదరాబాద్ మెట్రోకు రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 26, ప్రతినిధి: హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్ఎఫ్సీ) ద్వారా రూ.13,600 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ రీఫైనాన్సింగ్ లభించింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఐఆర్ఎఫ్సీ మరియు ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్, హెచ్ఎంఆర్ఎల్ మధ్య రుణ ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎఫ్సీ సీఎండీ & సీఈఓ మనోజ్ కుమార్ దుబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ వల్ల హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు ఆర్థిక ఉపశమనం లభించడంతో పాటు భవిష్యత్ విస్తరణ ప్రణాళికలకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. ప్రస్తుతం 69.2 కిలోమీటర్ల పొడవుతో 57 స్టేషన్లతో కొనసాగుతున్న హైదరాబాద్ మెట్రో ద్వారా రోజుకు 5 లక్షలకుపైగా ప్రయాణికులు సేవలు పొందుతున్నారని వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా కొత్త కారిడార్లు, చివరి మైలు కనెక్టివిటీ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## 8 వేల మహిళా సంఘాల భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 26, ప్రతినిధి: తెలంగాణ సచివాలయం నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో 8 వేల స్వయం సహాయక మహిళా సంఘాల భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఎమ్మెల్యేలు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిశోర్, ఎండోమెంట్స్ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, మహిళా శిశు అభివృద్ధి & సామాజిక సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్య, మహిళా & శిశు అభివృద్ధి శాఖ డైరెక్టర్ శృతి ఓజా తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన, గ్రామీణాభివృద్ధికి ఈ భవనాలు కేంద్రాలుగా మారనున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## సీపీఎం నేత సామినేని రామారావు హత్య కేసు నిందితులను వెంటనే అరెస్టు చేయాలి




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 26, ప్రతినిధి: చింతకాని మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావు హత్య కేసులో నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను కలిసి వినతి పత్రం సమర్పించింది. సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జగ్గుల జాన్ వెస్లీ ఆధ్వర్యంలో రాష్ట్ర బృందం, జిల్లా నాయకత్వం, సామినేని రామారావు సతీమణి సామినేని స్వరాజ్యం కలిసి ఈ వినతిపత్రాన్ని అందజేశారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని రామారావును అదే గ్రామానికి చెందిన బొర్రా ప్రసాద్, కంచుమర్తి రామకృష్ణ, మద్దినేని నాగేశ్వరరావు, కాండ్ర పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లు తదితరులు మరియు మరికొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు 2025 అక్టోబర్ 31న కత్తులతో దారుణంగా హత్య చేశారని బృందం ముఖ్యమంత్రికి వివరించింది. ఈ కేసులో నిందితులను వెంటనే అదుపులోకి తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు.

# మహిళా మహోత్సవాల్లో ఆదర్శ సంఘాలకు ఘన సన్మానం




సందేశం టైమ్స్, అందోల్ మండలం, మే 26, ప్రతినిధి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అందోల్ మండలంలోని పోసానిపేట్ గ్రామంలో మహిళా వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ సెక్రెటరీ షాజహాన్ బేగం, గ్రామ ఉపసర్పంచ్ జి.రాములు, వార్డు సభ్యులు వి.వెంకటేశం, వి.అలవేణి-సుధాకర్, యం.అనిత-లక్షుమన్, ఫీల్డ్ అసిస్టెంట్ యం.నగేష్, వీఓఏ ఎండి అఫ్సర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, పొదుపు అలవాట్ల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళా గ్రూపుల్లో సమయానికి రుణాలు చెల్లించిన ఆదర్శ మహిళా సంఘాలకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం చేపట్టనుండటం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. మహిళలు క్రమశిక్షణతో సంఘాలను ముందుకు నడిపిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని అధికారులు అభినందించారు. గ్రామంలో కొత్త మహిళా సంఘాల ఏర్పాటు ద్వారా మరింత మంది మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని సూచించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలు, గ్రామ సంఘాల బలోపేతం, మహిళా ఉపాధి అవకాశాల పెంపు, స్వయం ఉపాధి రంగాల అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని గ్రామ సెక్రెటరీ షాజహాన్ బేగం సూచించగా, మహిళలు ఆర్థికంగా ఎదిగితే గ్రామాభివృద్ధి వేగవంతమవుతుందని ఉపసర్పంచ్ జి.రాములు పేర్కొన్నారు. మహిళా సంఘాలు గ్రామాభివృద్ధికి కీలకమని వార్డు సభ్యులు అభిప్రాయపడ్డారు. మహిళలు పొదుపు అలవాటు పెంపొందించుకుని స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని ఫీల్డ్ అసిస్టెంట్ యం.నగేష్ సూచించారు. మహిళలు సమయానికి రుణాలు చెల్లిస్తూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని వీఓఏ ఎండి అఫ్సర్ అభినందించారు. పోసానిపేట్ గ్రామంలో జరుగనున్న ఈ మహిళా వార్షిక మహోత్సవాలు మహిళల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

# అడవుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రులు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండ సురేఖ సోమవారం పర్యటించి అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన పలు భవనాలను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో రూ.32 లక్షల 23 వేల కంపా నిధులతో నిర్మించిన అటవీ శాఖ బీట్ ఆఫీసర్ల వసతి గృహాలను ప్రారంభించిన అనంతరం రూ.1.44 కోట్ల CA-PD నిధులతో నిర్మించిన జిల్లా అటవీ సంరక్షణ అధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ అడవుల పరిరక్షణ, వాతావరణ సమతుల్యత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సంగారెడ్డి జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో అర్బన్ ఎకో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లో కొత్త ఎకో పార్కులను ప్రారంభిస్తామని తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసం ఆధునిక సౌకర్యాలతో జిల్లా అటవీ శాఖ కార్యాలయాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి సువర్ణ, PCCF ప్రియాంక వర్గీస్, TGIIC చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, సదాశివపేట చైర్‌పర్సన్ అంజమ్మ సత్యనారాయణ, జిల్లా అటవీ శాఖ సంరక్షణ అధికారి ప్రసాద్ రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, ఎఫ్ఆర్ఓ దేవీలాల్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మరమ్మతుల అనంతరం అంగన్‌వాడి పాఠశాల ప్రారంభం






సందేశం టైమ్స్, వట్పల్లి, మే 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని మేడికుంద గ్రామంలోని అంగన్‌వాడి భవనం (209 సెంటర్) మరమ్మతుల అనంతరం ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్‌రావు చేతుల మీదుగా ప్రారంభమైంది. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనానికి మరమ్మతులు అవసరమవడంతో సెల్పులు, కిటికీలు, టైల్స్, ప్లాస్టరింగ్, కిచెన్, బాత్‌రూమ్, విద్యుత్ సౌకర్యాలు, ఫ్యాన్స్, పెయింటింగ్ తదితర పనులు పూర్తి చేశారు. అనంతరం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ పాలక మండలి సభ్యులు, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ చిన్నారుల విద్యాభివృద్ధికి ఉపయోగపడే విధంగా అంగన్‌వాడి భవనాన్ని అభివృద్ధి చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. చిన్నారులకు మెరుగైన వాతావరణంలో విద్య, పోషకాహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.

# అండూర్ మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 26, బి డేవిడ్: జిన్నారం మున్సిపల్ పరిధిలోని అండూర్ గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, మల్లన్న జాతర కార్యక్రమాలలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి పొలంలో పాతిపెట్టిన భార్య




సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మే 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను హత్య చేసి శవాన్ని పొలంలో పాతిపెట్టిన సంచలన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగాపూర్ గ్రామానికి చెందిన శంబనోల్లా ముత్యం రెడ్డి(35) బోర్ మోటార్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, అతని భార్య కల్పనకు మానూర్ మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన గైని పండరితో గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ నెల 18న తన భర్త కనిపించడం లేదని కల్పన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో కల్పన ప్రవర్తనపై అనుమానం రావడంతో ఆమెను, గైని పండరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా హత్య విషయం బయటపడింది. ముత్యం రెడ్డి తమ సంబంధానికి అడ్డుగా మారుతున్నాడని భావించిన కల్పన, తన ప్రియుడు పండరితో కలిసి హత్యకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 16న బోర్ మోటార్ మరమ్మత్తు పని ఉందని నమ్మించి ముత్యం రెడ్డిని పొలానికి తీసుకెళ్లిన పండరి, అక్కడ ముందే సిద్ధంగా ఉన్న తన అన్న గైని విట్టల్‌తో కలిసి తాడుతో గొంతు బిగించి హత్య చేసినట్లు వెల్లడించారు. అనంతరం ముందుగానే జేసీబీతో తవ్విన గుంతలో మృతదేహాన్ని పాతిపెట్టి మట్టితో కప్పిపుచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితులు గైని పండరి, గైని విట్టల్, కల్పనలను అరెస్ట్ చేసి నారాయణఖేడ్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి జుడీషియల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

# సంగారెడ్డి జిల్లా కోర్టు ముందు న్యాయవాదుల ఆందోళన




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 26, ప్రతినిధి: హైకోర్టు న్యాయవాది కాజా మోసెస్‌పై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి దాడి చేసిన ఘటనను నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా కోర్టు ముందు న్యాయవాదులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్టపరమైన శిక్ష విధించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కోర్టు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు మరియు పలువురు న్యాయవాద సంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కోర్టు ప్రాంగణంలో కొంతసేపు నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘానికి వెయ్యి గజాల స్థలం కేటాయింపుకు చర్యలు – ఎమ్మెల్యే జీఎంఆర్



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 26, బి డేవిడ్: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగానికి కీలకంగా మారిన సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నియోజకవర్గ స్థాయి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అసోసియేషన్ వినతి పత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ కార్మికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేయాలని సూచించారు. సంఘం అభ్యర్థన మేరకు త్వరలో వెయ్యి గజాల స్థలం కేటాయించి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే కార్మిక శాఖ అధికారులతో చర్చించి ప్రతి కార్మికుడికి గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. అర్హులైన సెంట్రింగ్ కార్మికులకు స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు, లేనివారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, రాజు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు యాదగిరి, అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి – EGS APD పూజ



సందేశం టైమ్స్, న్యాల్కల్, మే 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని ఖలీల్‌పూర్, మీర్జాపూర్ బి, గంగ్వార్, ముంగి, న్యాల్కల్ గ్రామాల్లో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను EGS APD పూజ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలు, మొక్కల పెంపకం, ఉపాధి పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడిన ఆమె, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూలీలు అధిక సంఖ్యలో పనులకు హాజరై గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. నర్సరీల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా మొక్కల సంరక్షణ, నీటి వసతి, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ పనులను వేగవంతంగా పూర్తి చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో నరేష్ బాబు, ఏపీఓ రంగారావు, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి – జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

సందేశం టైమ్స్, మెదక్, మే 26, ప్రతినిధి: ప్రజావాణి దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మెదక్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 120 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిలో భూభారతి సంబంధిత 38, పెన్షన్‌కు సంబంధించిన 19, ఇందిరమ్మ ఇళ్ల కోసం 17, ఇతర సమస్యలకు సంబంధించిన 46 ఫిర్యాదులు నమోదు అయ్యాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల కోసం 13 కౌంటర్లు ఏర్పాటు చేసి శాఖల వారీగా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌ఓ అంబాదాస్ రాజేశ్వర్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలపై మరింత నిఘా పెంచాలి – జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 26, ప్రతినిధి: జిల్లాలో మత్తు పదార్థాలపై మరింత కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన మత్తు పదార్థాల నియంత్రణ, నిఘా సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల బారిన పడకుండా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు ఆదేశించారు. జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాలు, ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు ప్రజల సహకారంతో సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక నష్టాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువతను మంచి మార్గంలో నడిపించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, మత్తు పదార్థాల నియంత్రణ అధికారి చంద్రకళ, డీఎస్పీలు, పోలీసు, ఎక్సైజ్, విద్య, రవాణా, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మాఫ్టీలో తిరుగుతూ చెక్‌పోస్టులు తనిఖీ చేసిన అదనపు ఎస్పీ

సందేశం టైమ్స్, మెదక్, మే 26, ప్రతినిధి: మెదక్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాఫ్టీలో, ప్రైవేట్ వాహనంలో తిరుగుతూ జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లు, బక్రీద్ ప్రత్యేక చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూప్రాన్ టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి వాహనాల తనిఖీ విధానం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రవాణా అనుమతి పత్రాలు, సంబంధిత ధృవపత్రాలు తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. తనిఖీ చేసిన ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేసి పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. అక్రమ రవాణా లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బంది ట్రాఫిక్ బ్యాటన్స్, రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.

## అక్రమ గోవధ నివారణకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గోరక్షకుల వినతి




సందేశం టైమ్స్, మెదక్, మే 26, ప్రతినిధి: నర్సాపూర్ ఎస్ఐ మరియు సీఐలకు గోరక్షకుల సంఘం సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు అక్రమంగా గోవులను వధించకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గోమాత పరిరక్షణకు సంబంధిత చట్టాలను కఠినంగా అమలు చేయాలని, గ్రామాల్లో మరియు పట్టణాల్లో నిఘా పెంచాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా పండుగలను అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని, సామాజిక సామరస్యాన్ని కాపాడాలని వారు సూచించారు. ఒకరిపై ఒకరు మనోభావాలను గౌరవించుకుంటూ శాంతి వాతావరణాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోరక్షకుల సంఘం నర్సాపూర్ శాఖ సభ్యులు పాల్గొన్నారు.


## రాష్ట్ర వ్యాప్తంగా 8,000 మహిళా సంఘ భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







సందేశం టైమ్స్, మెదక్, మే 26, ప్రతినిధి: మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ సచివాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 8,000 మహిళా సంఘ భవనాల నిర్మాణానికి వర్చువల్ విధానంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బటన్ నొక్కి భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దనసరి అనసూయ సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళా సంఘాల ద్వారా ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ వర్చువల్ సమావేశంలో మెదక్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు, గోదాములు, రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు వంటి వ్యాపారాల్లో మహిళలు ముందుకు రావాలని, వారికి ప్రభుత్వం భూమి కేటాయింపు, రుణ సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళా సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించి న్యూట్రిషన్ స్టాల్స్‌ను పరిశీలించారు.

## మాతా శిశు ఆసుపత్రి ప్రాంగణంలో ట్రాఫిక్ కష్టాలు రోగుల తరలింపుకు ఆటంకం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మాతా శిశు ఆసుపత్రి పరిసరాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చడంతో రోగుల తరలింపుకు ఆటంకం ఏర్పడుతోంది. ఆసుపత్రి ప్రాంగణంలో ఆటోలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో అత్యవసర సేవలపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 108 అంబులెన్స్‌లు ఆసుపత్రి వరకు చేరుకునేందుకు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అత్యవసర సమయంలో గర్భిణీలు, నవజాత శిశువులు మరియు చిన్నారులను ఇతర ఆసుపత్రులకు తరలించే ప్రక్రియలో ఈ అక్రమ పార్కింగ్ పెద్ద అడ్డంకిగా మారుతోందని పేర్కొన్నారు. క్రమబద్ధత లేకుండా వాహనాల నిలిపివేత వల్ల సాధారణ రోగులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి యాజమాన్యం మరియు ట్రాఫిక్ పోలీసులు వెంటనే స్పందించి క్రమబద్ధమైన పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అత్యవసర వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గం కల్పించాలని స్థానికులు కోరారు.

## సూర్యాపేటలో ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం – ఆసుపత్రులు, పీహెచ్‌సీలను పరిశీలించిన డా. జయలక్ష్మి




సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 26, ప్రతినిధి: తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ (బేసిక్ సర్వీసెస్ డివిజన్) డా. జయలక్ష్మి సోమవారం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకట్ రమణ, ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రాం అధికారి డా. ప్రసిద్‌తో సమావేశమై 95-95-99 సూచికలు, హెచ్‌ఐవీ పరీక్షా కిట్లు మరియు ఇతర వైద్య సామగ్రి సరఫరా అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏఆర్టీ కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమై ఎల్ఎఫ్‌యూ (Lost to Follow-Up) కేసులను తగ్గించాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా స్థిరమైన రోగులకు ఎంఎండీ (మల్టీ మంత్ డిస్పెన్సేషన్) అందించాలని ఆదేశించారు. ఆ తర్వాత అరవపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి హెచ్‌ఐవీ కిట్లను పరిశీలించి, ప్రమాదకర ప్రవర్తన ఉన్న వారికి తప్పనిసరిగా డ్యూయల్ టెస్టింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది, ఐసిటీసీ, పీపీటీసీటీ, ఏఆర్టీ, సురక్ష కేంద్ర సిబ్బంది మరియు ఎన్‌జీవో బృందాలు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 26, ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంగీత ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 102 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 44, సంగారెడ్డి డివిజన్‌కు 17, ఆందోల్ డివిజన్‌కు 7, నారాయణఖేడ్ డివిజన్‌కు 16, జహీరాబాద్ డివిజన్‌కు 18 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలు సీఎం రేవంత్ రెడ్డి





సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 26, ప్రతినిధి: మహిళలే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడంతో పాటు మహిళల కోసం రూపొందించిన నూతన డిజైన్ ఇందిరమ్మ చీరలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా మహిళా సంఘాల ప్రతినిధులు కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళలు స్వయం ఆధారితంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు మహిళలను బస్సుల యజమానులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో వెయ్యి బస్సులను మహిళా సంఘాల ద్వారా నడిపిస్తున్నట్లు వెల్లడించారు. సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, గోదాములు వంటి వ్యాపారాల్లో మహిళలను భాగస్వాములుగా చేయనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించి వ్యాపార విస్తరణకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, మహిళలు ఇందులో కీలక పాత్ర పోషించాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చోరి కేసులో ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష


సందేశం టైమ్స్, చింతకాని, మే 26, ప్రతినిధి: చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరి కేసులో ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ మూడో అదనపు జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ఏ. ప్రవీణ్ తీర్పు వెలువరించారు. వందనం గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఏడాది జనవరి 15న తిరుపతి దర్శనానికి వెళ్లి 20న తిరిగి ఇంటికి రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, నగదు, టీవీ చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో చింతకాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి కాకరకాయల నరేష్ (వందనం), కందుకూరి సోమాచారి (సత్తుపల్లి)లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించి పక్కా సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా కోర్టు ఈ మేరకు శిక్ష విధించింది. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీ. రాహుల్, విచారణాధికారి ఎస్సై ఎన్. వీరేందర్, కోర్టు లియాజనింగ్ ఆఫీసర్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ విజయ్‌కుమార్‌లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. నేరాలకు పాల్పడిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరని, దొంగతనాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఎస్సై ఎన్. వీరేందర్ హెచ్చరించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



సందేశం టైమ్స్, ఆందోల్ మండల ప్రతినిధి, మే 26: సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను అదనపు కలెక్టర్ సంగీత స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. ప్రజావాణిలో కలెక్టర్ కార్యాలయంలో 44, సంగారెడ్డి డివిజన్‌లో 17, నారాయణఖేడ్‌లో 16, జహీరాబాద్‌లో 18, ఆందోల్‌లో 7 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10 వేల జరిమానా




సందేశం టైమ్స్, కొల్చారం మండలం, మే 26, ప్రతినిధి: కొల్చారం మండలంలో మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై మహమ్మద్ మొహియొద్దీన్ తెలిపారు. వాహనాల తనిఖీల సమయంలో ఒక వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడినట్లు పేర్కొన్నారు. కేసుకు సంబంధించి నిందితుడు సోమవారం కోర్టులో హాజరుకాగా న్యాయస్థానం జరిమానా విధించినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడు జరిమానా మొత్తాన్ని చెల్లించినట్లు వెల్లడించారు. వాహన నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 26, ప్రతినిధి: ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న 8 వేల మహిళా గ్రామ సంఘ భవనాలకు వర్చువల్ విధానంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. గ్రామీణ మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, ఉపాధి నైపుణ్య శిక్షణ పొందడానికి, వారు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించడానికి మహిళా గ్రామ సంఘ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు ఇప్పటికే రూ.60,472 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు అందించి మహిళలు స్వయం ఉపాధి ద్వారా మరింత అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పెట్రోల్ బంకులు, ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో మహిళా సంఘాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం పలు జిల్లాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు తమ విజయగాథలను పంచుకున్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, డీఆర్‌డీఓ జ్యోతి, ఇతర అధికారులు, మహిళా సంఘాల సభ్యులు వీక్షించారు.

# పకడ్బందీగా ధాన్యం కొనుగోలు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 26, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లావ్యాప్తంగా 53,048 మంది రైతుల నుంచి 2,53,804.600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే 35,688 మంది రైతుల ఖాతాల్లో రూ.394.92 కోట్లను జమ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# అల్లాదుర్గం ప్రజావాణికి ఒక్కటే దరఖాస్తు




సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, మే 26, అల్లాదుర్గం ప్రతినిధి: అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక్కటే దరఖాస్తు వచ్చినట్లు తహశీల్దార్ మల్లయ్య తెలిపారు. రేషన్ కార్డులో తమ కుటుంబానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లు నమోదు అయ్యాయని, వాటిని తొలగించాలని బాధితులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మరో 70 మంది చిన్నారులకు జగ్గారెడ్డి సైకిళ్ల పంపిణీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 26, ప్రతినిధి: స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంగారెడ్డి పట్టణంలో మరో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 70 మంది చిన్నారులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ముఖాల్లో ఆనందం చూడటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 400 మంది చిన్నారులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే మరో 156 మంది అర్హులైన చిన్నారులకు సైకిళ్ల కోసం టోకెన్లు అందజేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కిరణ్ గౌడ్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొని జగ్గారెడ్డి చేపట్టిన సేవా కార్యక్రమాలను అభినందించారు.



# మహిళల ఆర్థిక, సామాజిక ప్రగతికే ఇందిరా మహిళా శక్తి

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 26, ప్రతినిధి: మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడంతో పాటు ఇందిరమ్మ చీరల కొత్త డిజైన్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మహిళా సంఘ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి విలేజ్ ఆర్గనైజేషన్‌కు సొంత భవనం నిర్మించాలనే ప్రభుత్వ సంకల్పమని, స్థల వివరాలతో ప్రతిపాదనలు అందిస్తే మరుసటి రోజే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. మహిళా సంఘాల ద్వారా చేపట్టే నిర్మాణ పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక పెట్రోల్ బంక్ మహిళా సంఘాలకు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంటూ హుజూర్‌నగర్‌లో నిర్మాణం చివరి దశలో ఉందని, కోదాడలో స్థలం గుర్తించామని, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు ధాన్య సేకరణకే పరిమితం కాకుండా రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు, సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాకు 16 గోదాములు మంజూరయ్యాయని, లాజిస్టిక్స్ పార్క్ కోసం 10 ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు ఇప్పటికే రూ.700 కోట్లకు పైగా బ్యాంక్ లింకేజ్ రుణాలు అందించినట్లు వెల్లడిస్తూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి మైక్రో క్రెడిట్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళల ఆరోగ్యం, పోషకాహారం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాల్లో రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్‌డీవో పీడీ సన్యాసయ్య, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీఎంఓ నాగేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.